'స్వాతి' వారపత్రిక - 29-06-2001

# ఏదీ ఊరికే రాదు

ఆ రోజు ఆదివారం. ఆర్రోజుల పనితో అలసిపోయిన శరీరానికీ, సహోద్యోగుల రాజకీయాలతో విసుగెత్తిన మనసుకీ విశ్రాంతి దొరికే రోజు.

బారెడు పొద్దెక్కాక లేచి, స్నానాదులు ముగించి తీరుబడిగా డైనింగ్ టెబుల్ వద్ద కూర్చున్నాడు వాసు అని పిలవబడే వాసుదేవరావు. పిల్లలిద్దరూ అప్పటికే ప్రైవేటు క్లాసులకి పోవడంతో, వాసు వాక్స్వాతంత్ర్యానికి ఆటంకాలుండవు. భార్య సుగుణకి ఈ ఏకాంతం అప్పుడప్పుడూ కొన్ని సమస్యల్ని లేవనెత్తినా, భర్తతో వాదులాడ్డానికి అనువైన సమయం కాబట్టి వెనుకాడదు.

ఆవిర్లు కక్కుతున్న నాలుగు ఇడ్లీలని వాసు ప్లేట్లో వేసి, తనో రెండు ఇడ్లీలు వేసుకొని పక్కనే కూర్చుని, పచ్చడి గిన్నె అతని ముందుకు తోసింది.

"ఏమిటీ దారుణం, నాకు నాలుగు వడ్డించి నువ్వు రెండు తినడమా?! తిండి వండేదీ, వండినది వడ్డించేదీ నువ్వే అయినా, నీ కడుపు మాడ్చి చంపుతున్నానని నన్నందరూ, ముఖ్యంగా మీ వాళ్ళందరూ ఆడిపోసుకుంటారు!" అంటూ ఒక ఇడ్లీని రెండు ఇడ్లీలకీ సరిపడే చట్నీతో స్వాహా చేశాడు వాసుదేవరావు.

సుగుణ ఒక ఇడ్లీని సుతారంగా విరుచుకొంటూ, కొద్ది కొద్దిగా పచ్చడిలో నంజుకుంటూ తింది. సుగుణ రెండో ఇడ్లీ తినేసరికి వాసు ప్లేటు ఖాళీ అయింది. మూత పెట్టిన కాసిరోల్‌ని ముందరకు లాగి మూత తెరచింది. అందులో ఇంకా పది దాకా ఇడ్లీలున్నాయి.

"వేసుకొంటారా, వెయ్యమన్నారా?!" అడిగిందామె.

వాసు అప్పటికే అడుగంటిన పచ్చడి గిన్నె కేసి చూస్తూ "ఏం నేనేమైనా భీముణ్ణనుకొన్నావా?! అధికంగా నా కడుపులో కూరి నేను లావెక్కిపోతుంటే నువ్వు స్లిమ్‌గా తయారయి, ఏనుగూ, ఎర్ర గుర్రం సామ్యం తీసుకొచ్చి హేళన చేద్దామనా?" అన్నాడు సీరియస్‌గా.

"సెనగపప్పూ, కొబ్బరీ, పుదీనాలతో కలిపి చేసిన చట్నీ ఈ రోజు బాగా కుదిరింది. అంతా ఒక్కసారే ఎదురుగా పెడ్తే ఇడ్లీలు మిగిలిపోతాయని, కిచెన్‌లో వేరే దాచాను. గొప్పలకి పోక వడ్డించుకోండి" అంటూ సుగుణ కిచెన్‌లోకి వెళ్ళి మరో గిన్నెలో పచ్చడి తీసుకొచ్చి బల్ల మీద పెట్టింది. వాసు ఇడ్లీలు వేసుకోలేదు.

"చట్నీ తీసుకొచ్చాగా వేసుకోండి" అంది సుగుణ.

"నేనేం తిండిపోతును కాను?" అన్నాడు వాసు గంభీరంగా, తృప్తి కలగని కడుపు లోలోపల గోలపెడ్తున్నా.

"హోటల్లో అయితే ఒక్కొక్క ప్లేటుకీ నాలుగు రూపాయల చొప్పున ముచ్చటగా మూడు ప్లేట్లు లాగిస్తేనేకాని ఊరుకోని మనిషి, తేరగా దొరికిన పెళ్ళాం చేసిన ఇడ్లీలు ఊరికే దొరకటంతో చులకనగా ఉంది! తినండి" అంటూ వాసు ప్లేట్లో నాలుగు ఇడ్లీలూ, తన ప్లేట్లో రెండు ఇడ్లీలు వేసి, కాసిరోల్ మీద మూతపెడ్తూ 'ఇవి పనిమనిషికి'ని దూరంగా తోసింది.

"లౌక్యమంతా నీ చేష్టల్లోనే కనబడ్తోంది! దిష్టి కొట్టకుండా రెండేసి చొప్పున ఆరగించిన చతురురాలివి" అంటూ చట్నీ గిన్నె సగం వంపుకుంటూ, ప్లేటు ఖాళీ చేశాడు. సుగుణ తానూ తిని, కిచెన్‌లోకి పోయి కొద్ది నిముషాల్లో కాఫీ గ్లాసులు తీసుకొచ్చి బల్ల మీద పెట్టింది. కాఫీలయింతర్వాత సుగుణ లేచి వెళ్ళబోతోంటే చెయ్యి పట్టుకొని ఆపి, "ఏమిటీ, ఇడ్లీలు ఊరికే దొరికాయా? నువ్వు తేరగా దొరికావా? అలా కూర్చో చెబ్తాను" అన్నాడు వాసు.

'మడతపేచీ మహానుభావుడు!' అని లోపల అనుకొంటూ సుగుణకి కూర్చోక తప్పిందికాదు.

"మినప్పప్పు కిలోఎంత? ఇడ్లీ రవ్వ కిలో ఎంత? చట్నీలో ఉపయోగించిన గుల్ల సెనగపప్పూ, పుదీనా ఆకులూ నూనెతో సహా ఇతర పోపు సామాన్లూ, ఉప్పూ, పచ్చిమిరపకాయలూ - వీటన్నిటి కిలోల ధరలెంత? అన్నట్టు కొబ్బరికాయ ధర ఎంత?"

"కొబ్బరికాయ మన పెరట్లోని చెట్టుకు కాసిందే!"

"కొబ్బరి చెట్లోకి వాడిన నీళ్ళు మళ్ళించడానికి, వాస్తు కుదిరేటట్లు ఇంటి చుట్టూ తిప్పి తూము కట్టించాము. ఎర్రనల్లి బారి పడకుండా మొవ్వల్లోనూ, చెట్టు మొదట్లోనూ పురుగుల మందు వేయించాం. కాయ దిగుబడి పెరగడానికి రెడ్ పొటాషూ, ఉప్పూ ఎరువులుగా వేశాం. కాయలు తీయడానికి తడవతడవకూ చెట్టెక్కిన మనిషికి డబ్బులిచ్చాం. అందుకని టెంకాయ పెరట్లోదయినా దానికీ ఓ ఖరీదుంది!

"ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే, మౌలికమైన ధరల్ని గణనలోకి తీసుకొని నువ్వు చేసిన ఇడ్లీ, చట్నీలలో ఉపయోగించిన సరుకుల విలువ కట్టు. కొంత పెట్టుబడిపెట్టి గాస్ స్టవ్వూ, ఎలక్ట్రికల్ మిక్సీ, ప్రెషర్ కుక్కరూ కొన్నాం. వీటికి ఇన్ని వేల గంటలని ఓ ఉపయోగ జీవితకాలం అంటూ ఉంటుంది. పిండి రుబ్బడానికీ, ఇడ్లీలు వండడానికి ఎంత టైము పట్టిందీ చూసి, వాటి వాటి విలువ కట్టు. అదనంగా గ్యాస్ ఖర్చూ, కరెంటు ఖర్చూ ఎంతవుతుందో అంచనా వేసి మొత్తం కలుపు, వండిన ఇడ్లీల సంఖ్యతో భాగించు, ఇడ్లీ వెల ఎంతో తెలుస్తుంది" అన్నాడు వాసు.

"మరి నా చాకిరీ మాట?" ఆసక్తికరంగా ప్రశ్నించిందామె.

"అమూల్యం! ఇల్లాలి చాకిరీ వెలకట్టలేనిది. కానైతే పద్ధ శ్రమకి ఓ వంటమనిషికిచ్చే డబ్బుని ప్రమాణంగా తీసుకొని, నీ శ్రమకీ అందాజాగా విలువ కట్టవచ్చు. పనిమనిషికి ఇచ్చే జీతంలోనూ, ఉపయోగించిన క్లీనింగ్ పౌడర్లూ వగైరాలకైన ఖర్చులోనూ కొంత ఈ గిన్నెల్నీ, పళ్ళాల్నీ తోమినందుకు కేటాయించాలి. ఇలా అన్నింటనీ గణనలోకి తీసుకొంటే, మనం తిన్న ఇడ్లీలు ఊరికే దొరకలేదని ఊహ కందుతుంది. లాభం మినహాయిస్తే హోటలు వాడికీ మనకీ ఒకటే

ఖర్చు. ఇంత బాదరబందీ పడే బదులు, హోటలు కెళ్ళి ఇడ్లీ పార్సెలు చేయించుకొస్తే హాయిగా వుంటుంది".

"కానైతే వాడు లాభం వేసుకోందే అమ్మడు కదా. చివరికి ఇంట్లో లాగించే అరడజను ఇడ్లీల ఖరీదు, హోటల్లో తినే నాలుగిడ్లీల ఖరీదుతో సమానమౌతుంది. వెళ్ళి రావడానికి పెట్రోలుఖర్చూ, అరిగిన టైర్ల ఖరీదూ, స్కూటర్‌కి పెట్టిన పెట్టుబడిలో కొంత భాగమూ, రోడ్డు టాక్స్‌లో కొంత శాతమూ కలిపితే ఆ ఇడ్లీ పార్సెలు ఖరీదు మరెంతవుతుందో?!" సుగుణ నవ్వుతూ అంది.

"దార్లో పడుతున్నావ్, సంతోషం. ఇంతకీ చివరికి తేలిందేమిటంటే ఇంట్లో వండిన ఇడ్లీలు హోటలుకన్నా చౌకే కాని, ఊరికే మట్టుకు రావు! అవునా?" వాసు ప్రశ్నించాడు.

సుగుణ మౌనంగా తల ఊపింది.

"అంటే ఒకసారి వండిపడేశాక దాన్ని తిన్నా పారేసినా ఖర్చు మటుకు తప్పదు. అందుకనే మన పెళ్ళిభోజనాల్లో, ఇతర విందుల్లో సగం తిని పారేసే అతిథిదేవుళ్ళని చూస్తే తన్నబుద్ధి వేస్తుంది!" అన్నాడు వాసు.

"ఆకులు నాకి కూర్చుంటే అదోలా చూస్తారు. అందుకనే కాస్త ఫ్యాషన్‌గా వదిలెయ్యాలి. మీకేమీ తెలియదు".

"కావల్సినంతే వేసే వడ్డన వాళ్ళూ, కావల్సినంతే వేయించుకొనే అతిథి భోక్తలూ ఉంటే, ఎంగిలాకుల్లో మిగిలిన పదార్థాలని ఏరుకోడానికి కుక్కల్నీ, కాకుల్నీ దూరంగా అదిలించే నిర్భాగ్యులకి వాస్తవానికి విస్తరేసి వడ్డించవచ్చు. వారి దీవెనలు వధూవరులకి మేలు చేస్తాయి. అప్పుచేసి పెళ్ళి చేస్తున్నవారి సంగతి గురించి ఆలోచిస్తే, నువ్వా వదిలేసే ఫ్యాషన్ గురించి మాట్లాడవు" అన్నాడు వాసుదేవరావు.

"అవున్లెండి, అనండి అనండి! వినడానికీ, పద్దానికీ తేరగా దొరికానుకదా!"

"ప్రస్తుతానికి ఇడ్లీ ప్రహసనం ముగిసింది. ఇంక ఆ విషయంపై ముచ్చటించుకొందాం. మరో కప్పు కాఫీ..."

"అదనంగా ఖర్చవుతుంది తెమ్మంటారా?"

"చెప్పబోయే విషయానికి మరింత మూడ్ కావాలి. ప్లీజ్ పట్టుకురా" అన్నాడు వాసు.

సుగుణ మరో రెండు గ్లాసుల కాఫీ చేసి తీసుకొచ్చి, భర్త కొకటి ఇచ్చి తానొకటి తీసుకొంది.

"అసలు పెళ్ళెందుకు చేసుకొంటారు?" ప్రశ్నించాడు వాసు.

"సంసారం చేసి సంతానం కనేటందుకు" సుగుణ చాలా తేలిగ్గా సమాధానమిచ్చింది.

"హిపోక్రసీ, అదే తెలుగులో చెప్పుకోవాలంటే, కపట భావప్రకటన – అంటే దీన్నే అంటారు. సంతానమనేది ఓ ఫలితమే కాని, వివాహానికి వాస్తవమైన కారణం కాదు. కామం అను, మరేదైనా అను, వయసొచ్చిన స్త్రీపురుషులకి ఓ శరీరావసరం పుట్టుకొస్తుంది. స్త్రీపురుష సంగమమనేది ప్రప్రథమంగా ఆ కామం తీరడం కోసమే. నిజం చెప్పు, మన మొదటి రాత్రి

నువ్వు సంతానాన్ని గురించి ఆలోచించావా, లేదా సెక్సులో ఉన్న సుగుణాల్ని గురించి ఆలోచించావా?"

"పోదురూ, వెధవ గొడవ!" సుగుణ సిగ్గుగా అంది.

"అదే, ఆ హిపోక్రసీయే వద్దంటున్నాను. సరే అసలు విషయానికొద్దాం. ఉదాహరణకి నా సంగతి తీసుకో. నాకు ఉద్యోగం దొరికిన రోజు నుంచి నా తల్లిదండ్రుల మీద ఆధారపడ్డం మానేశాను. నాకు ఉండడానికి గూడు ఉండాలి. కట్టడానికి బట్ట ఉండాలి. బతకడానికి తిండి ఉండాలి. ఒంటరిగావున్నా ఓ ఇంటివాణ్ణైనా నేను జీవించి ఉండడానికి నాకనే ఖర్చు ఉంటుంది. సాంఘికపరమైన చట్రంలో నా తల్లిదండ్రుల గురించీ, నా వైపు వాళ్ళ గురించీ కొంత ఖర్చు చేయక తప్పదు. ఇవన్నీ నా ఖాతా పద్దులు. సరే నాకు నీతో పెళ్ళయింది. ఇద్దరు పిల్లల్ని కన్నాం, జీవితాంతమూ నిన్నూ, స్వతంత్రులయ్యేవరకూ వాళ్ళనీ పోషించవలసిన బాధ్యత నాది. వాళ్ళకి చదువులు చెప్పించాలి, పెళ్ళిళ్ళు చెయ్యాలి, పురుళ్ళు పోయ్యాలి. ప్రస్తుతం మనం నలుగురూ బతకటానికవుతున్న ఖర్చుని నాలుగు వాటాలు వేస్తే, ఒక వంతు ఖర్చు నా మీద, మిగిలిన మూడు వంతుల ఖర్చూ మీ మీద"

"మీరు సంపాదించిందంతా ఖర్చు చెయ్యట్లేదుగా? కొంత ఆదా చేస్తున్నారు" అంది సుగుణ.

"నా బాధ్యతలన్నీ తీరిన తర్వాత మిగిలిన సొమ్ము మీ ముగ్గురి కోసమేకదా. ఆ ఆదా కూడా మీ ముగ్గురి భవిష్యత్ కోసం నా కయిన ఖర్చేకదా?"

"అంటే...?" సుగుణ అర్థోక్తిగా ఆగిపోయింది.

"అంటే, నేను జీవించడానికి నా ఖాతాకి జమ అయిన ఖర్చు తప్పించి, మిగిలిన వ్యయమంతా వివాహఫలితంగా జరిగింది. ఓ సంగతి చెబుతున్నాను, జాగ్రత్తగా విను. ప్రపంచవ్యాప్తంగా జరిగిన సర్వేల ప్రకారం, మొత్తం దాంపత్య జీవితంలో స్త్రీ పురుషులు సగటున రెండు వేల అయిదు వందలమార్లు రమిస్తారట. వివాహఫలితంగా మీ ముగ్గురి మీదా అయిన మొత్తం ఖర్చుని ఈ సంఖ్యతో భాగిస్తే, నీతో ప్రతి నిద్రా నాకు తేరగా దొరకలేదని గ్రహించు మరి! అది, అది..."

"సానికొంపకి వెళ్ళే ఖర్చుకన్నా అధికమంటారు. అదే కదా మీరనబోయేది?! కామం తీర్చుకోవడం కోసం ఇంత ఖర్చయ్యే వివాహం అనవసరమంటారు! అయితే నేను తీసుకొచ్చిన వరకట్నం ఏ ఖర్చులో వేస్తారు?"

"నీ చివరి ప్రశ్నకు ముందుగా సమాధానం చెబ్తాను. అది నీ తల్లిదండ్రుల నిద్రల ఖర్చులోకి వెడ్తుంది. ఆ సొమ్ముని మా దోసిట్లో పోశారు. కాబట్టి అది ఎలా ఖర్చయిందీ ముందు ఆలోచించాలి. ఆ సొమ్ము అంతా మన వివాహంలోనే ఖర్చయిపోయింది. కాబట్టి దాన్ని నా కయిన ఖర్చుకి జోడించి పై సంఖ్యతో భాగిస్తే మన ప్రతీ నిద్రకైన ఖర్చు తెలుస్తుంది. అందుచేత మన నిద్ర ఖరీదు, నా నిద్ర ఖరీదుకన్నా ఎక్కువ. కాదంటావూ, నా కయిన ఖర్చులోంచి నువ్వు తీసుకొచ్చిన కట్నం విలువ మైనస్ చేసి, మిగిలిన ఖర్చుని భాగిస్తే నీతో ప్రతి నిద్రలో నాకు చాలా అల్పశాతం ఖర్చు తగ్గినట్టవుతుందికాని, ఊరికే మట్టుకు కాదు! ఇంక నీ మొదటి

కామెంట్‌కి నా సమాధానం విను. ఒక విధంగా ఆలోచిస్తే స్వంత కారు ఖర్చు భరించే తాహతున్న మనిషికి, ఏ బాదరబందీలూ లేకుండా టాక్సీ మీద పోయే తాహతు ఉంటుంది. అదీకాక...."

"అందుకని బ్రహ్మచారిగా ఉంటూ, ఆలి కంటే వెలయాలు ఉత్తమం అంటారు!"

"అలాగని అన్నానా? ఐనా వివాహానికి న్యాయశాస్త్రం నిర్వచనమేమిటో తెలుసా? న్యాయసమ్మతమై ఆమోదం పొందిన వ్యభిచారం! స్వంత కారుంటే సమాజంలో ఉండే గౌరవం, హోదా టాక్సీ మీద వెళ్తే ఉండవు. టాక్సీ మీదే ఆధారపడితే అవసరమైనప్పుడు దొరకదు"

"స్వామీ, నేను అంటున్నది కూడా అదే, కట్టుకొన్న ఆడది తేరగా ఎప్పుడుపడితే అప్పుడు..."

"ఆగాగు, మరీ అంత ఘోరంగా మాట్లాడకు, నేను చెప్పదలచింది విను. ఇల్లాలుతో కాపురం ఇంటికి శోభ తెస్తుంది. అది వంటికీ మంచిది. మూడ్ బావున్నప్పుడు వైవాహిక జీవితంలో స్త్రీపురుషులొకరికొకరు అందుబాటులో ఉంటారను తప్ప, వైవాహిక జీవితం మట్టుకు ఖర్చు లేకుండా దొరుకుతుందనకు. ప్రతిదానికీ జీవితంలో వ్యయం జరుగుతుంది. ప్రతి అదనపు సుఖానికీ వ్యయం పెరుగుతుంది."

"ఏదో ఆ పాడు నిద్రకు వెలకట్టే ప్రయత్నంలో ఉన్నారే తప్ప. సంసారం చేసి కన్న సంతానం తల కింద కొరివి పెట్టి, నా బొందో అని ఏడుస్తారనీ, ఆ అనుబంధం కోసమే ఈ ఖర్చంతా అనీ ఎందుకనుకోరు? బ్రహ్మచారి చావూ, కుక్క చావూ ఒకటే అంటారు కదా!"

"నీ మాటా కాదనడానికి వీల్లేదు. వంశం సాగడమనేది అంతర్లీనమైన ఓ అహం. వంశం గుర్తింపుకి కూడా వివాహం ముఖ్యం. కానైతే ఇందులో కూడా ఓ చిన్న విశేషముంది. ఎంత తక్కువ సంతానాన్ని కంటే అంత ఎక్కువగా పొదుపు చెయ్యగలుగుతాం. ఎంత ఎక్కువగా కూడబెట్టి మనం సంతానానికి ఇవ్వగలిగితే, వాళ్ళంత గట్టిగానూ, నిజంగానూ ఏడుస్తారు! ఏమంటావు?" అన్నాడు వాసుదేవరావు.

"మీరన్న మాటల్లో నిజం లేకపోలేదు"

"అమ్మయ్య, బతికించావు. రేపు మీ అక్కా బావా వస్తున్నారని చెప్పావు. వదినగారు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత మళ్ళీ గర్భంతో వుంది. ఛాందసురాలైన మీ అక్కని నువ్వు ఒప్పించు. మీ బావగార్ని నేను ఒప్పించి హాస్పిటల్‌కి తీసుకువెళ్తాను. ఓ పుణ్యకార్యం చేసిన వాళ్ళమవుతాం" అన్నాడు వాసు.

"ఎక్కడ మొదలైన ఇడ్లీ ప్రహసనం ఎక్కడ ముగిసింది! ప్రయత్నిస్తాను" అంది సుగుణ.

"అవునూ, పిల్లలు ఇంట్లో లేరు. పనిమనిషి పదకొండు గంటలు దాటితేకాని రాదు. ఈలోపుగా...."

"అందుకే అన్నాను తేర...."

"ఇటువంటి అవకాశాల్ని అదనంగా వాడుకొంటే తప్ప ఆ సగటు సంఖ్యకి దిగువగా ఉండిపోతాం, బాగా ఆలోచించుకో మరి"

"..................."